క్లుప్తంగా

షిర్డీసాయిబాబాకు లక్ష పుష్పార్చన



పుష్పాలంకరణలో సాయినాథుడు

సీతమ్మధార: గురుపౌర్ణమిని పురస్కరించుకుని గురువారం నార్త్ ఎక్స్‌టెన్షన్‌లోని షిర్డీసాయిబాబా దేవాలయంలో ప్రత్యేక పూజలు చేశారు. ప్రధాన అర్చకుడు రాజాస్వామి ఆధ్వర్యంలో ఉదయం బాబాకు పంచామృతాభిషేకం, విశేష అర్చనలు జరిపారు. గులాబీ, మల్లె, చామంతి, విరజాజీ తదితర లక్ష పుష్పాలతో సాయినాథుడిని ప్రత్యేకంగా అలంకరించి భక్తులకు దర్శనం కల్పించారు. ఈ సందర్భంగా రాజాస్వామి మాట్లాడుతూ గురుపౌర్ణమిని పురస్కరించుకొని పది రోజుల పాటు బాబాకు ప్రత్యేక అలంకరణలు ఉంటాయన్నారు. మధ్యాహ్నం భక్తులకు అన్నదానం నిర్వహించారు. కార్యక్రమంలో అర్చక బృందం, సిబ్బంది శివకుమార్, వనజాక్షి పాల్గొన్నారు.

విద్యుత్ సరఫరాకు అంతరాయం నేడు

మురళీనగర్: జోన్–2 పరిధిలోని ఇండస్ట్రియల్ ఎస్టేట్ 33/11 కేవీ సబ్ స్టేషన్ నిర్వహణ పనుల కారణంగా శుక్రవారం విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నట్లు ఏపీఈపీడీసీఎల్ జోన్–2 ఈఈ బీకే నాయుడు ఒక ప్రకటనలో తెలిపారు. ఈ మేరకు ఇండస్ట్రియల్ ఎస్టేట్ ఏరియా, ప్రభుత్వ ఐటీఐ, కెమికల్ ఇంజినీరింగ్ కాలేజీ, జ్యోతినగర్, గౌతమి గార్డెన్స్, హ్యాపీ హోమ్స్ అపార్ట్‌మెంట్స్, సిద్ధార్థనగర్, సంకుర్‌పేట, శ్రీరామనగర్, లక్ష్మీనివాస్ అపార్ట్‌మెంట్ ప్రాంతాల్లో ఉదయం 8 నుంచి 11 గంటల వరకు విద్యుత్ సరఫరా ఉండదని చెప్పారు.

అక్కయ్యపాలెం సెక్షన్‌లో రేపు..

తాటిచెట్లపాలెం: అక్కయ్యపాలెం సెక్షన్ 11 కేవీ గ్రీన్‌పార్క్ ఫీడర్ పరిధిలో నిర్వహణ పనుల నిమిత్తం 24వ తేదీన విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నట్లు జోన్–1 ఈఈ(ఆపరేషన్స్) జి.సత్యనారాయణ ఒక ప్రకటనలో తెలిపారు. ఈ మేరకు నరసింహనగర్ రైతుబజార్ ప్రాంతం, బాలయ్యశాస్త్రి లేఅవుట్, శాంతిపురం, ఎన్‌జీజీవోస్ కాలనీ, శంకరమఠం రోడ్, జీవీఎంసీ పంప్ హౌస్, జీవీఎంసీ స్కూల్స్, విద్యుత్ నగర్ అర్బన్ హెల్త్ సెంటర్, కిన్నెర మెస్ ప్రాంతం, జీవీఎంసీ పార్క్ సచివాలయం, పద్మశ్రీ హాస్పిటల్, ఫోర్త్ టౌన్ పోలీస్ స్టేషన్ రోడ్ ప్రాంతాల్లో శనివారం ఉదయం 9.30 నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు విద్యుత్ సరఫరా ఉండదని, వినియోగదారులు గమనించాలని ఆయన కోరారు.

డ్రగ్స్, ఆల్కహాల్ దుష్పరిణామాలపై సదస్సు

దాబాగార్డెన్స్: నగరంలోని ఏవీఎన్ కళాశాలలో ఎన్‌ఎంబీఏ నషా ముక్త్ భారత్ అభియాన్, డిస్ట్రిక్ట్ లీగల్ సర్వీసెస్ అథారిటీ ఆధ్వర్యంలో గురువారం నేషనల్ యాక్షన్ ప్లాన్ ఫర్ డ్రగ్ డిమాండ్ రిడక్షన్‌పై సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా పలువురు వక్తలు డ్రగ్స్, ఆల్కహాల్ దుష్పరిణామాలపై విద్యార్థులకు వివరించారు. సీనియర్ సివిల్ జడ్జి అండ్ డిస్ట్రిక్ట్ లీగల్ సర్వీసెస్ అథారిటీ సెక్రటరీ ఎంవీ శేషమ్మ, అసిస్టెంట్ డైరెక్టర్ ఫర్ వెల్ఫేర్ ఆఫ్ ది డిఫరెంట్లీ ఏబుల్డ్, ట్రాన్స్‌జెండర్ అండ్ సీనియర్ సిటిజన్స్ జె.మాధవి, స్పెషల్ ఎన్‌ఫోర్స్‌మెంట్ బ్యూరో సర్కిల్ ఇన్‌స్పెక్టర్ జగదీష్, మానసిక వైద్యురాలు డాక్టర్ మాధవీలత, ఎన్జీవో ఎస్ఈఈడీ సెక్రటరీ వీఎస్ రాజు, అసోసియేట్ ప్రొఫెసర్ డాక్టర్ పీజే శ్రీనివాస్, కళాశాల ప్రిన్సిపాల్ ఎం. సింహాద్రినాయుడు, కరస్పాండెంట్ ఏవీ అదీప్ భానోజీరావు మాట్లాడుతూ విద్యార్థులు డ్రగ్స్‌కు దూరంగా ఉండాలని, సేటు నో డ్రగ్స్ నినాదాన్ని అందరికీ వ్యాప్తి చేయాలని విద్యార్థులందరితో ప్రతిజ్ఞ చేయించారు. డ్రగ్స్ నివారణకు సంబంధించి టోల్‌ఫ్రీ నంబర్ 1098 గురించి తెలిపారు. డ్రగ్స్ నుంచి ఎలా బయటపడాలో వివరించారు. కళాశాల ఐక్యూఏసీ కో ఆర్డినేటర్ పి. కృష్ణకుమారి, డి. సంతోష్‌కుమార్, ఎం.స్వరాజ్యలక్ష్మి, కె.ఇందిర, తదితరులు పాల్గొన్నారు.

ఫ్రెండ్లీ పోలీసింగ్



కంచరపాలెం ఐదో పట్టణ పోలీస్ స్టేషన్

- కంచరపాలెం పోలీస్ స్టేషన్‌లో పటిష్టంగా అమలు
- ఫిర్యాదుదారులతో స్నేహపూర్వకంగా నడుచుకుంటున్న పోలీసులు
- గతంలో కంటే కేసులు తగ్గుముఖం

మర్రిపాలెం: నగరానికి కొత్త పోలీస్ బాస్ సీపీ త్రివిక్రమ్ వర్మ వచ్చాక పోలీస్ స్టేషన్లలో కొత్త విధానాలకు తెర లేపారు. స్టేషన్‌కు ఏ పనిమీద ఎవరు వచ్చినా.. లేక ఫిర్యాదు ఇవ్వడానికి వచ్చినా ఫ్రెండ్లీ పోలీసింగ్ రూపంలో సిబ్బంది సేవలందిస్తున్నారు. కంచరపాలెం ఐదో పట్టణ పోలీస్ స్టేషన్‌లో ఈ విధానం పటిష్టంగా అమలవుతోంది. పోలీసులు ఫిర్యాదుదారులతో స్నేహపూర్వకంగా మెలుగుతూ వారి సమస్యలను వెంటనే పరిష్కరిస్తున్నారు. ఎటువంటి కేసులైనా మొదట వారికి అవగాహన కల్పిస్తూ, కౌన్సెలింగ్‌లు నిర్వహించి తగు సూచనలిస్తున్నారు. దీంతో ప్రజల్లో పోలీస్ అంటే గౌరవం పెరిగింది. ఎవరైనా ఫిర్యాదుదారులు వస్తే వారిని గౌరవించి కూర్చోమనడం, ఏం జరిగిందో, సమస్య ఏంటో తెలుసుకోవడం వంటివి కంచరపాలెం పోలీస్ స్టేషన్‌లో నిత్యం చూస్తున్నాం. దీంతో ప్రస్తుతం ఇక్కడ కేసులు తక్కువగా నమోదవుతున్నాయి. గతంలో ఫ్రెండ్లీ పోలీసింగ్ అనేది ఉన్నప్పటికీ.. ప్రస్తుతం రిసెప్షన్ డెస్క్ ఏర్పాటు చేసి, ఫిర్యాదు ఇవ్వడానికి వచ్చిన వారికి కూర్చోవడానికి అనుకూలంగా కుర్చీలు ఏర్పాటు చేశారు. 'మీ రక్షణలో అహర్నిశం' అని చక్కని వాతావరణం కల్పిస్తున్నారు ఇక్కడి సిబ్బంది. అందరితో స్నేహపూర్వకంగా నడుచుకోవడం, ముఖ్యంగా మహిళల పట్ల గౌరవంతో మరింత మర్యాదగా ప్రవర్తిస్తున్నారు. దీంతో ప్రజలతో ఇంటరాక్షన్ పెరిగింది. దీనికి కారణం మహిళా పోలీసులు రావడం. వార్డు సచివాలయాల్లో మహిళా పోలీసులు ఉండటం ప్రయోజనకరంగా మారింది.

ప్రజలకు మరింత చేరువ

మహిళల ప్రత్యేక భద్రత కోసం దిశ పెట్రోలింగ్ వాహనాలు ఏర్పాటు చేయడం తెలిసిందే. స్కూళ్లు, కాలేజీలు విడిచిపెట్టేటప్పుడు విద్యార్థినులకు రక్షణగా ఇవి గస్తీ తిరుగుతుంటాయి. బ్యాడ్ టచ్–గుడ్ టచ్, మైనర్ వివాహాల వంటి అంశాలపై బాలికలు, వారి తల్లిదండ్రులకు ప్రత్యేక కౌన్సెలింగ్‌లు నిర్వహిస్తున్నారు. దిశ కాల్ సెంటర్ 112, జగనన్నకు చెప్తాం 1902 వంటి హెల్ప్ లైన్లు పెట్టడం వల్ల ప్రజలకు ఇంకొంచెం చేరువ అవుతున్నారు. కాల్ అందిన క్షణాల్లోనే స్పందించి సమస్యను బట్టి సంబంధిత అధికారులను రప్పించి వారి సమస్యను పరిష్కరించడమే కాకుండా ఫీడ్‌బ్యాక్ కూడా తీసుకుంటున్నారు. కంచరపాలెం స్టేషన్‌లోని ప్రతి ఒక్క సిబ్బంది బాధ్యతగా ఈ అవగాహన కల్పిస్తున్నారు. మహిళా పోలీసులు కూడా కౌన్సెలింగ్ నిర్వహిస్తున్నారు. ప్రియారిటీ ట్రయల్ కేసులపై ప్రత్యేక ఆదేశాలు డీజీ జారీ చేశారు. సమాజాన్ని ఎక్కువగా ప్రభావితం మహిళలపై అత్యాచారాలు, మైనర్లపై జరుగుతున్న అరాచకాలు వంటి కేసులపై ప్రత్యేక దృష్టి సారించి త్వరితగతిన పూర్తిచేస్తున్నామని వారు పోలీసులు చెబుతున్నారు.



రిసెప్షన్ వద్ద ఫిర్యాదుదారులతో మాట్లాడుతున్న స్టేషన్ సిబ్బంది

గత నెలలో కేసుల వివరాలు..

కంచరపాలెం ఐదో పట్టణ పోలీస్ స్టేషన్ పరిధిలో గత నెలలో 235 పిటీషన్లు రాగా.. అందులో 22 ఎఫ్ఐఆర్‌లు నమోదు చేశారు. వాటిలో ఆత్మహత్యలు, రోడ్డు ప్రమాదాలు, భార్యాభర్తల గొడవలు, మిస్సింగ్, చీటింగ్, కొట్లాటలు ఇలా అనేక రకాల కేసులు ఉన్నాయి. అందులో 48 సివిల్ కేసులు ఉంటే వారిని కోర్టుకు వెళ్లాలని పోలీసులు సూచించారు. చిన్న చిన్న తగాదా కేసులను ఎప్పటికప్పుడు పోలీసులు పరిష్కరిస్తారు. దీంతో మే నెలలో పెండింగ్ కేసుల సంఖ్య సున్నా అయినట్టే. పోలీస్ స్టేషన్‌కు వచ్చిన ఫిర్యాదుదారులతో ఫ్రెండ్లీగా ఉంటూ గొడవలు సద్దుమణిగేలా వారికి కౌన్సెలింగ్ చేస్తూ శభాష్ అనిపించుకునేలా చేస్తున్నారు ఐదో పట్టణ పోలీసులు.

చాలా మార్పులు వచ్చాయి



గతంతో పోల్చుకుంటే పోలీస్ శాఖలో చాలా మార్పులు వచ్చాయి. ప్రజల భద్రతను దృష్టిలో పెట్టుకుని స్టేషన్‌కు వచ్చే వారిని ఆప్యాయంగా పలకరించి ఫ్రెండ్లీ పోలీసింగ్ వాతావరణాన్ని ఏర్పాటు చేసి వారి సమస్యలు తెలుసుకుంటున్నాం. పోలీస్ కమిషనర్ త్రివిక్రమ్ వర్మ ఆదేశాల మేరకు ప్రతి కేసును క్షుణ్ణంగా పరిశీలించి వారికి కౌన్సెలింగ్ చేస్తున్నాం. మహిళలు ఇచ్చే ఫిర్యాదులపై ప్రత్యేక దృష్టి సారించి వాటిని పరిష్కరించే విధంగా చర్యలు తీసుకుంటున్నాం. ప్రజలు కూడా పోలీసులు ఎంతో సహకరిస్తున్నారు.

– ఎస్.విజయ్‌కుమార్, సీఐ, కంచరపాలెం

జగనన్న పాలనలో ఇంటింటికీ సంక్షేమం



సంక్షేమ పథకాల బ్రోచర్ అందజేస్తున్న సమన్వయకర్త కె.కె.రాజు, కార్పొరేటర్ గోవింద్

సీతంపేట: ప్రతి గడపకూ సంక్షేమమే జగనన్న ప్రభుత్వ లక్ష్యమని నెడ్‌క్యాప్ చైర్మన్, వైఎస్సార్‌సీపీ ఉత్తర నియోజకవర్గ సమన్వయకర్త కె.కె.రాజు అన్నారు. జీవీఎంసీ 25వ వార్డు రాజేంద్రనగర్ సచివాలయం పరిధిలోని బీటీఆర్ కాలనీ, రెల్లి వీధి ప్రాంతాల్లో గురువారం గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమం నిర్వహించారు. జీవీఎంసీ స్టాండింగ్ కమిటీ మెంబర్, కార్పొరేటర్ సారిపిల్లి గోవింద్‌తో కలిసి ఆయన ఇంటింటికీ వెళ్లి ఇప్పటి వరకు ప్రభుత్వం అమలు చేసిన సంక్షేమ పథకాల ప్రయోజనాలు వివరిస్తూ.. ప్రజల సమస్యలు అడిగి తెలుసుకున్నారు.

ఈ సందర్భంగా కె.కె.రాజు మాట్లాడుతూ అర్హులైన ప్రతి ఒక్కరికీ సంక్షేమ పథకాలు నిష్పక్షపాతంగా అందాలనే ఉద్దేశంతో ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి పనిచేస్తున్నారన్నారు. ఈ సంక్షేమ ఫలాలు ఇంటింటికీ అందుతున్నాయా లేదా అని తెలుసుకోవడంతోపాటు ప్రజల సమస్యలను వినతుల రూపంలో స్వీకరించడానికి గడప గడపకు మన ప్రభుత్వం చేపడుతున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో మాజీ కార్పొరేటర్ బాక్సర్ రాజు, రాష్ట్ర సంయుక్త కార్యదర్శి కిరణ్‌రాజు, డైరెక్టర్ రాయుడు శ్రీను, 25వ వార్డు నాయకులు సానబోయిన సురేష్, భోగవిల్లి గోవింద్, సారిపిల్లి సంతోష్, హరికృష్ణ, ముప్పల సంతోష్, సమ్మెట్ల వెంకటేష్, సన్నీ, అశోక్, రవి, గోవిందమ్మ సచివాలయ సిబ్బంది, వలంటీర్లు పాల్గొన్నారు.

నేడు వారాహి హోమం



వారాహి దేవికి పూజలు చేస్తున్న అర్చకుడు

సీతంపేట: లలితానగర్ లలితా పీఠంలో వారాహి నవరాత్రులు సోమవారం నుంచి అత్యంత వైభవంగా జరుగుతున్నాయి. వేడుకల్లో భాగంగా నాలుగో రోజు గురువారం సాయంత్రం వారాహి దేవి అమ్మవారికి పండితుల వేదమంత్రాల మధ్య సహస్ర నామార్చన చేశారు. అనంతరం అమ్మవారిని పూల మాలతో సుందరంగా అలంకరించి దూప దీప నైవేద్యాలు సమర్పించారు. భక్తులు పెద్ద సంఖ్యలో అమ్మవారికి పూజలు చేశారు. ఈ సందర్భంగా పీఠం మేనేజర్ మన్నవ కృష్ణసేన్ మాట్లాడుతూ వారాహి దేవిని పూజించడం వల్ల కష్టాల నుంచి ఉపశమనం, భూ సంబంధిత వ్యవహారాల పరిష్కారం, శత్రునాశనం, మానసిక సమస్యల నుంచి విముక్తి, ఆరోగ్యం చేకూరుతాయన్నారు. 23వ తేదీ శుక్రవారం సాయంత్రం 7 గంటలకు వారాహి హోమం జరుగుతుందని, పాల్గొన దలచిన భక్తులు లలితా పీఠం కార్యాలయంలో సంప్రదించాలని ఆయన కోరారు.

అంతర్జాతీయ సదస్సులో పరిశోధన పత్రం సమర్పణ



త్రినాథరావును అభినందిస్తున్న వీసీ ప్రసాదరెడ్డి

ఏయూ క్యాంపస్: ఆంధ్ర విశ్వవిద్యాలయం జియోఫిజిక్స్ విభాగం ఆచార్యుడు పి.త్రినాథరావు ఇండోనేషియాలోని జకార్తాలో ఇటీవల జరిగిన అంతర్జాతీయ సదస్సులో పరిశోధన పత్రాన్ని సమర్పించారు. ప్రపంచ వ్యాప్తంగా 71 మంది పరిశోధన పత్రాలు సదస్సుకు ఎంపికయ్యాయి. ఈ సందర్భంగా త్రినాథరావును ఏయూ వీసీ ప్రసాదరెడ్డి, రిజిస్ట్రార్ ఆచార్య వి.కృష్ణమోహన్ తన కార్యాలయంలో అభినందించారు.

ఎన్‌ఎంసీహెచ్ స్కూల్‌లో డిప్యూటీ డీఈవో తనిఖీలు



ఉపాధ్యాయులతో ఫిర్యాదుపై చర్చిస్తున్న డిప్యూటీ డీఈవో గౌరీశంకర్

సీతమ్మధార: స్థానిక పీ అండ్ టీ కాలనీలోని ఎన్‌ఎంసీహెచ్ స్కూల్‌లో గురువారం ఉప విద్యా శాఖాధికారి(డిప్యూటీ డీఈవో) గౌరీశంకర్ తనిఖీలు చేశారు. స్కూల్ కమిటీ చైర్మన్ రఘు ఫిర్యాదుతో ఆర్‌జేడీ ఆదేశాల మేరకు తరగతి గదులకు వెళ్లి విద్యార్థుల నోట్‌బుక్స్, రికార్డులు, జగనన్న విద్యా కానుక కిట్లు పరిశీలించారు. పదో తరగతి విద్యార్థులు, ఇంటర్మీడియట్ విద్యార్థినులతో మాట్లాడి వారికి పలు సూచనలిచ్చారు. ఉపాధ్యాయులు ఏవిధంగా బోధిస్తున్నారో అడిగి తెలుసుకున్నారు. ల్యాబ్, డిజిటల్ బోర్డులు, ఆర్వో ప్లాంట్‌తోపాటు గుడ్లు, చెక్కీలు ఉంచిన గదిని, రాగి జావ నాణ్యతను ఆయన పరిశీలించారు. అనంతరం ఉపాధ్యాయులతో నిర్వహించిన సమావేశంలో ఫిర్యాదుపై చర్చించి వివరాలు సేకరించారు. ఈ ఏడాది మార్చిలో స్కూల్ కమిటీ చైర్మన్ రఘు చేసిన ఫిర్యాదు మేరకు తనిఖీలు చేపట్టినట్లు గౌరీశంకర్ తెలిపారు. హెచ్‌ఎం పని తీరుపై లేఖ రాయాలని సూచించారు. కమిటీ మెంబర్ ఇందిరా, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

25న ఉచిత వైద్య శిబిరం

మురళీనగర్: మురళీనగర్ వాకర్స్ పార్కులో సెవెన్ హిల్స్ ఆస్పత్రి సౌజన్యంతో ఈ నెల 25న ఉచిత వైద్య శిబిరం నిర్వహించనున్నట్లు వాకర్స్ క్లబ్ అధ్యక్ష, కార్యదర్శులు పల్లా చంద్రమౌళి, ఎల్‌వీ సుధాకర్ ఒక ప్రకటనలో తెలిపారు. ఆదివారం ఉదయం 6.30 నుంచి మధ్యాహ్నం 12.30 గంటల వరకు శిబిరం జరుగుతుందన్నారు. చెవి, ముక్కు, గొంతు వ్యాధుల నిపుణులు, సాధారణ వ్యాధుల నిపుణులతో ఉచితంగా వైద్య పరీక్షలు చేస్తారని చెప్పారు. ఈఎన్‌టీ స్పెషలిస్ట్ డాక్టర్ దిలీప్ దుంగల, సాధారణ వ్యాధుల నిపుణులు డాక్టర్ అఖిల్ భార్గవ్, డాక్టర్ సీహెచ్.వరప్రసాద్ పాల్గొంటారని, స్థానికులు ఈ అవకాశాన్ని వినియోగించుకోవాలని వారు కోరారు.

మహిళకు గాయాలు



గాయపడిన మహిళ

మర్రిపాలెం : ఆర్టీసీ బస్సు విద్యుత్ స్తంభాన్ని ఢీకొంది. ఈ క్రమంలో ద్విచక్రవాహనంపై అటుగా వెళుతున్న ఓ మహిళ అదుపుతప్పి పడిపోవడంతో గాయాలయ్యాయి. గురువారం రాత్రి 12 గంటల ప్రాంతంలో కంచరపాలెం పరిధి రైల్వే న్యూకాలనీ ఈ ప్రమాదం చోటుచేసుకుంది. పూర్తి వివరాలు తెలియాల్సి ఉంది.



విద్యుత్‌స్తంభాన్ని ఢీకొన్న బస్సు

ఆరోగ్య ఆహార ఫలహారశాల ప్రారంభం



ఫలహారశాలను ప్రారంభిస్తున్న వీసీ ప్రసాదరెడ్డి

ఏయూ క్యాంపస్: ఆరోగ్యానికి మేలు చేసే ఆహారాన్ని స్వీకరించాలని ఏయూ వీసీ ఆచార్య పి.వి.జి.డి.ప్రసాదరెడ్డి సూచించారు. గురువారం ఉదయం బీచ్‌రోడ్డులోని యోగా విలేజ్‌లో ఏర్పాటు చేసిన ఫలహార శాలను ఆయన ప్రారంభించారు. అనంతరం సిరిధాన్యాలతో ఆహార పదార్థాలను తయారు చేస్తున్న విధానాన్ని ప్రత్యక్షంగా పరిశీలించారు. రిజిస్ట్రార్ ఆచార్య వి.కృష్ణమోహన్ మాట్లాడుతూ మానవ ఆరోగ్యానికి ఉపయుక్తంగా నిలిచే సిరిధాన్యాలను ఉపయోగిస్తూ విభిన్న ఆహార పదార్థాల తయారీ చేస్తూ, విక్రయించే విధంగా ఈ కేంద్రం ఏర్పాటు చేశామన్నారు. ప్రజల్లో ఆరోగ్యం, ఆహారంపై అవగాహన పెంపొందించడానికి ఈ కేంద్రం ఎంతగానో దోహదపడుతుందన్నారు. ఈ కార్యక్రమంలో రెక్టార్ ఆచార్య కె.సమత, యోగా కేంద్రం సంచాలకులు ఆచార్య ఒ.ఎస్.ఆర్.యు.భానుకుమార్, డాక్టర్ తులసీరావు, వీసీ ఆచార్య వి.బాలమోహన్ దాస్, న్యాయ కళాశాల ప్రిన్సిపాల్ ఆచార్య వి.వి జయలక్ష్మి అవినాష్ సంస్థ నిర్వాహకులు ప్రజ్ఞానంద్, సాయిపద్మ తదితరులు పాల్గొన్నారు.

నిరుద్యోగ యువతకు శిక్షణ

అక్కిరెడ్డిపాలెం: విశాఖ జిల్లాలోని నిరుద్యోగ యువతకు మంగళగిరిలోని ఆంధ్రప్రదేశ్ ఖాదీ మరియు గ్రామీణ పరిశ్రమల మండలి ప్రధాన కార్యాలయంలో కార్పెంటర్ మరియు ఎలక్ట్రికల్ కోర్సుల్లో శిక్షణ ఇవ్వనున్నట్లు విశాఖ జిల్లా ఖాదీ , గ్రామీణ పరిశ్రమల మండలి సహాయ సంచాలకులు డాక్టర్. వి.పద్మ గురువారం ప్రకటనలో తెలిపారు. శిక్షణ సమయంలో ఉచిత వసతి, భోజన సౌకర్యం కల్పిస్తారని, అనంతరం సర్టిఫికెట్లు అందజేస్తారని పేర్కొన్నారు. కోర్సు పూర్తి చేసుకున్న యువతకు ప్రధానమంత్రి ఉపాధి కల్పన పథకం (పీఎంఈజీపీ) ద్వారా రుణఅవకాశం కల్పిస్తారని తెలియజేశారు. ఈ అవకాశాన్ని జిల్లాలోని నిరుద్యోగ యువత ఉపయోగించుకోవాలని కోరారు. వివరాలకు 90596 65146, 80087 15357 నంబర్లలో సంప్రదించాలని సూచించారు.

సమాచారమ్

పారిశుధ్య సమస్యా.. ఫోన్ చేయండి



జ్ఞానాపురంలోని జోన్-5 కార్యాలయం

కంచరపాలెం: జీవీఎంసీ జోన్–5 పరిధిలోని నియోజకవర్గాలకు సంబంధించి ప్రజారోగ్యం, పారిశుధ్య సమస్యలపై అధికారులకు ఫోన్ చేసి తెలియజేయవచ్చు. ఆయా వార్డులకు సంబంధించి పబ్లిక్ హెల్త్‌పై సమాచారం తెలుసుకుకోవచ్చు. కాలువలు, గెడ్డల్లో చెత్తాచెదారం, పూడికలు సక్రమంగా తొలగించకపోయినా.. రహదారులను శుభ్రం చేయకపోయినా.. పారిశుధ్యం సిబ్బంది నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నా ఫిర్యాదులు చేయవచ్చు. పారిశుధ్య సమస్యలపై ఆయా వార్డుల శానిటరీ ఇన్‌స్పెక్టర్లు, హెల్త్ అసిస్టెంట్లకు ఫోన్ ద్వారా సమాచారం అందించాలని, అలా కాని పక్షంలో ప్రతి సోమవారం జ్ఞానాపురంలోని జోన్–5 కార్యాలయం జోనల్ కమిషనర్ ఆర్.జి.వి.కృష్ణ సమక్షంలో నిర్వహించే స్పందన కార్యక్రమంలో ప్రజలు ఫిర్యాదులు చేయవచ్చని పబ్లిక్ హెల్త్ ఏఎంహెచ్‌వో డాక్టర్ ఎ.సునీల్‌కుమార్ తెలిపారు.

జోన్-5 శానిటరీ ఇన్‌స్పెక్టర్లు, హెల్త్ అసిస్టెంట్ల వివరాలు

వార్డు నం.	అధికారి	బాధ్యత	ఫోన్ నంబర్
జోన్–5	డాక్టర్ ఎ.సునీల్‌కుమార్	ఏఎంహెచ్‌వో(పబ్లిక్ హెల్త్)	99480 95520
జోన్–5	ఎస్.జనార్దనరావు	శానిటరీ సూపర్‌వైజర్	70363 96919
41	ఎం.ప్రసాద్	శానిటరీ ఇన్‌స్పెక్టర్	99488 83942
42	ఎం.సన్యాసిదొర	హెల్త్ అసిస్టెంట్	77299 95924
43	అప్పారావు	ఔట్ సోర్సింగ్ ఇన్‌చార్జి	99665 91821
44	ఎన్.సూరిబాబు	శానిటరీ ఇన్‌స్పెక్టర్	99488 83938
45	కె.పాండురంగా	హెల్త్ అసిస్టెంట్	99488 83932
46	వి.సత్యం	శానిటరీ ఇన్‌స్పెక్టర్	80085 36403
47	కె.వి.రమణమూర్తి	శానిటరీ ఇన్‌స్పెక్టర్	99488 83970
48	డి.అప్పలరాజు	శానిటరీ ఇన్‌స్పెక్టర్	90103 93037
49	ఎం.రామకృష్ణ	శానిటరీ ఇన్‌స్పెక్టర్	99488 83937
50	ఎం.సుధాకర్	హెల్త్ అసిస్టెంట్	94941 83244
51	ఎం.సుధాకర్	హెల్త్ అసిస్టెంట్ ఇన్‌చార్జి	94941 83244
54	వై.త్రిమూర్తులు	మేస్త్రీ(పబ్లిక్ హెల్త్)	99488 83947
55	ఉప్పిలి కార్తీక్	హెల్త్ అసిస్టెంట్	91105 97632

అవ్వాతాతలకు కంటి వెలుగు

అంధత్వ నివారణకు వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం శ్రీకారం చుట్టింది. డాక్టర్ వైఎస్సార్ కంటి వెలుగు కార్యక్రమంపై ప్రత్యేక శ్రద్ధ చూపుతోంది. ఈ పథకం ఇప్పుడు మంచి ఫలితాలు ఇస్తోంది. కంటి చూపు సమస్యతో బాధపడుతున్న ఎంతో మంది వృద్ధులకు చూపు ప్రసాదిస్తోంది.

- వైఎస్సార్ కంటి వెలుగు ద్వారా నేత్ర వైద్య పరీక్షలు
- జిల్లాలో 21,180 మందికి కళ్లద్దాలు అవసరమని గుర్తింపు
- 17,249 మందికి పంపిణీ



ప్రభుత్వ ప్రాంతీయ నేత్ర వైద్యశాల





వృద్ధురాలికి కంటి వైద్య పరీక్షలు చేస్తున్న డాక్టర్

మహారాణిపేట: డాక్టర్ వైఎస్సార్ కంటి వెలుగు కార్యక్రమం ద్వారా 60 ఏళ్లు దాటిన వృద్ధులకు రాష్ట్ర వైద్య, ఆరోగ్య శాఖ ఉచితంగా కంటి వైద్య పరీక్షలు నిర్వహిస్తోంది. శస్త్రచికిత్సలు, కళ్లజోళ్లు, మందులు ఉచితంగా పంపిణీ చేస్తోంది.

వృద్ధులతో మొదలు..

వృద్ధుల కంటి సమస్యలు మొదటి దశలోనే గుర్తించి చికిత్స చేస్తే సమస్య నుంచి బయటపడవచ్చు. ప్రత్యేక శిబిరాలు, ఆస్పత్రుల్లో కంటి స్క్రీనింగ్ పరీక్షలు నిర్వహిస్తున్నారు. తద్వారా కంటి సమస్యతో ఇబ్బంది పడుతున్న వారిని గుర్తిస్తున్నారు. ఇప్పటి వరకు మూడు విడతల్లో కంటి వెలుగు కార్యక్రమం నిర్వహించారు. జిల్లాలో 60 ఏళ్ల వయస్సు దాటిన అవ్వాతాతలు 2,18,446 మంది ఉన్నట్టు గుర్తించారు. వీరిలో 1,33,622 మందికి వైద్య పరీక్షలు చేశారు. 21,180 మందికి కళ్లద్దాలు అవసరమని గుర్తించి, 17,249 మందికి వాటిని పంపిణీ చేశారు. మిగిలిన వారికి కూడా కళ్లజోళ్లు సిద్ధం చేశారు. లబ్ధిదారులు వచ్చి కళ్లద్దాలు తీసుకోవచ్చని వైద్యులు సూచిస్తున్నారు. 7,776 మందికి క్యాటరాక్ట్ శస్త్రచికిత్సలు అవసరంగా గుర్తించారు. వీరిలో 3,394 మందికి ఆపరేషన్లు చేశారు. పలు ప్రైవేటు ఆస్పత్రుల సహకారంతో వీటిని నిర్వహిస్తున్నారు.

వృద్ధులందరికీ పరీక్షలు



మూడు విడతల్లో వైఎస్సార్ కంటి వెలుగు కార్యక్రమం కింద వృద్ధులందరికీ కంటి పరీక్షలు పూర్తి చేశాం. గ్రామీణ, పట్టణ ప్రాంతాల్లో అవ్వాతాతలకు కళ్లజోళ్లు ఇచ్చాం. కంటికి శస్త్రచికిత్సలు కూడా చేస్తున్నాం. ఎన్‌జీవో సహకారంతో లబ్ధిదారులను గుర్తిస్తున్నాం. ఈ కార్యక్రమం ఆగస్టు వరకు అమల్లో ఉంటుంది.

– డాక్టర్ జగదీశ్వరరావు, జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి

అవసరమైన వారికి శస్త్రచికిత్సలు



కంటి వెలుగు కార్యక్రమంలో అవ్వాతాతలకు అధిక ప్రాధాన్యమిస్తున్నాం. ప్రభుత్వ ఆదేశాల మేరకు ప్రత్యేక శిబిరాలు నిర్వహించడం, ఆస్పత్రికి వచ్చే వారికి కంటి వెలుగు కార్యక్రమంపై అవగాహన కల్పిస్తున్నాం. పరీక్షల అనంతరం అవసరమైతే శస్త్రచికిత్సలు చేస్తున్నాం. క్యాటరాక్ట్ ఆపరేషన్లు కూడా నిర్వహిస్తున్నాం.

– డాక్టర్ విశ్వామిత్ర, సూపరింటెండెంట్, ప్రభుత్వ ప్రాంతీయ కంటి ఆస్పత్రి

డిగ్రీ సర్టిఫికెట్ల పరిశీలనకు నేడు గడువు

మద్దిలపాలెం: డాక్టర్ వీఎస్ కృష్ణా ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో ఫస్ట్ ఇయర్‌లో ప్రవేశానికి ఆన్‌లైన్‌లో రిజిస్ట్రేషన్ చేసుకున్న విద్యార్థుల ఒరిజినల్ సర్టిఫికెట్ల పరిశీలన ప్రక్రియ గడువు శుక్రవారంతో ముగియనుంది. విద్యార్థులు తమ సర్టిఫికెట్లను సాయంత్రం 5 గంటల్లోగా పరిశీలన చేయించుకోవాలని ప్రిన్సిపాల్ డాక్టర్ ఐ.విజయబాబు సూచించారు.